


ప్రకృతివనంలో గంజాయి విక్రయం

పల్లె ప్రకృతివనంలో గంజాయి విక్రయానికి పాల్పడుతున్న ఇద్దరిని వర్గల్ మండలం గౌరారం పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేశారు. వివరాలు 8లో ▸



పదింతల కసరత్తు

పదో తరగతిలో ఉత్తమ పాయింట్లు సాధించడానికి విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఉపాధ్యాయులు సైతం ప్రణాళికలు రూపొందించి అమలు పరుస్తున్నారు. వివరాలు 8లో ▸



న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఈవీఎంలు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాల కోసం భవనాలను కలెక్టర్ రాహుల్‌రాజ్ శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో మెదక్ పార్లమెంట్ పరిధిలోని నర్సాపూర్, మెదక్, గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట అసెంబ్లీ సెగ్మెంట్ల ఈవీఎంలు భద్రపర్చడంతో పాటు ఓట్ల లెక్కించేందుకు సదుపాయాలపై ఆరా తీశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ కమలాద్రి, ఆర్ఐ ఫైజల్ తదితరులు ఉన్నారు.

మహిళా ఉద్యోగుల సేవలు హర్షణీయం



మహిళా ఉద్యోగులతో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, తదితరులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మహిళా ఉద్యోగుల సేవలు హర్షణీయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగులను చిలప్‌చెడ్ ప్రాథమిక పాఠశాలలో చౌటకూరి గోవర్దన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి బ్రదర్స్, తారా విష్ణువర్దన్‌రెడ్డి సహకారంతో పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి శాఖలోనూ మహిళా ఉద్యోగులు తమ సేవలు అందిస్తూ సత్తా చాటుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వినోద రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి కమలాకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు సబ్బని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు రుణాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: అర్హులకు విశ్వకర్మ యోజన పథకం కింద రుణాలు ఇవ్వాలని అదనపు కలెక్టర్ రమేశ్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలించి రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకానికి నైపుణ్య ధ్రువీకరణ తర్వాత 5 నుంచి 7 రోజుల పాటు ప్రాథమిక శిక్షణ ఉంటుందని తెలిపారు. అలాగే 15 రోజుల పాటు అధునాతన శిక్షణ ఉంటుందని, ఆ తర్వాత రూ.15 వేల విలువైన పనిముట్లను ప్రోత్సాహకంగా అందిస్తారని పేర్కొన్నారు. బ్యాంకు ద్వారా మొదటి విడతగా రూ.లక్ష, రెండో విడతగా రూ. రెండు లక్షల రుణం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి కృష్ణమూర్తి, ఆయా శాఖల అధికారులు, కులవృత్తుల వారు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

మనోహరాబాద్(తూప్రాన్): పశువులకు వ్యాధులు సంక్రమించకుండా టీకాలు వేయించాలని జిల్లా అదనపు పశువైద్య సంచాలకులు వెంకటయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమం నెల రోజుల పాటు కొనసాగుతుందని, మనోహరాబాద్, తూప్రాన్ రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి తూప్రాన్ మండల పశు వైద్యురాలు లక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజుకున్న రగడ

- మూడేళ్లుగా బెస్త, ముదిరాజ్‌ల మధ్య పంచాయితీ
- పోటాపోటీగా బూర్గుపల్లి పెద్ద చెరువులో చేపల వేట
- వల చుట్టుకొని వ్యక్తి మృతి, ఆగ్రహించిన ముదిరాజ్ కులస్తులు
- డీఎస్పీ, ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్‌కు గాయాలు



రాజు మృతదేహం

మెదక్/హవేళిఘణాపూర్: బెస్త, ముదిరాజ్‌ల మధ్య మూడేళ్లుగా కొనసాగుతున్న వివాదం పెద్దదైంది. చేపలు పట్టేందుకు ఇరువర్గాలు పోటాపోటీగా చెరువులోకి దిగగా ప్రమాదవశాత్తు ముదిరాజ్‌వర్గానికి చెందిన కొల్లూరి రాజు (28) మృతిచెందాడు. దీంతో ఆగ్రహానికి గురైన ఆ వర్గం దాడులకు దిగింది. 12 బైక్‌లు, ఒక టాటాఏస్ వాహనానికి నిప్పుపెట్టారు. దాడిలో మెదక్‌రూరల్ ఎస్ఐ అమర్, డీఎస్పీ రాజేశ్‌తో పాటు మహిళా కానిస్టేబుల్ గాయపడ్డారు.

హవేళిఘణాపూర్ మండలం బూర్గుపల్లి పరిధిలో పెద్ద చెరువు, శ్రీపతి చెరువు, పోచారం డ్యాంలో చేపలు పట్టేందుకు వీలుంది. గతంలో కేవలం 26 మందికి మాత్రమే చేపలు పట్టుకునేందుకు లైసెన్స్‌లు ఉన్నాయి. వీరిలో 16 మంది బెస్త వారు కాగా 10 మంది ముదిరాజ్‌లు ఉన్నారు. అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బెస్త వారితో పాటు ముదిరాజ్‌లకు హక్కులు ఉంటాయని చెప్పడంతో గ్రామానికి చెందిన 126 మంది ముదిరాజ్‌లు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరికి 2021 మేలో మత్స్యశాఖ అధికారులు స్కిల్ టెస్టు నిర్వహించగా 56 మంది పాసయ్యారు. అయితే పాత వారు 26 మంది తమకు మాత్రమే హక్కులు ఉంటాయని ఎదురు తిరుగడంతో రెండువర్గాల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. 26 మంది కోర్టుకు వెళ్లి స్కిల్ టెస్టులో పాసైన వారికి లైసెన్స్‌లు ఇవ్వొద్దని స్టే తెచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం పోలీస్ పహారాలో 26 మంది పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వలలు వేశారు. మాకు కూడా చెరువుపై హక్కు ఉంటుందని ముదిరాజ్‌లు చెరువులోకి దిగగా ప్రమాదవశాత్తు రాజు కాళ్లకు వల చుట్టుకొని నీట మునిగి మృతిచెందాడు.



ముదిరాజ్‌లను సముదాయిస్తున్న డీఎస్పీ రాజేశ్

11 గంటల పాటు నీటిలోనే..

శుక్రవారం ఉదయం 7 గంటలకు మత్స్యకారులు వలలు వేశారు. రాజు వలకు చుట్టుకొని చనిపోగా, అప్పటికే తెప్పలపై చెరువు మధ్యలో ఉన్న 16 మంది మత్స్యకారులు గట్టుకు రాకుండా నీటిలోనే ఉండిపోయారు. వారు పైకి వస్తే చంపేస్తామంటూ చెరువు చుట్టూ కాపలా కాశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుమారు 11 గంటల పాటు మత్స్యకారులు నీటిలోనే ఉండిపోయారు. చెరువుకు ఒకవైపున మృతదేహన్ని ట్రాక్టర్‌పై వేసేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తుండగా, కొంతమంది ముదిరాజ్‌లు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇదే అదునుగా భావించిన నీటిలో ఉన్న 16 మంది మరో వైపు నుంచి పోలీసుల సహాయంతో ఒడ్డుకు చేరి వెళ్లిపోయారు.



చెరువులో ఇరుక్కున్న మత్స్యకారులు

మైనంపల్లి హామీతో సద్దుమణిగిన సమస్య

పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు మెదక్‌కు వచ్చారు. ఈ విషయం తెలుసుకొని ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదవశాత్తు మరణించిన రాజు కుటుంబానికి రూ. 4 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు అక్కడున్న పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు మరో రూ. 2 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. వీటితో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే సహాయాన్ని సైతం మృతుడి కుటుంబానికి ఇప్పిస్తానని మైనంపల్లి హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.

బాధ్యులపై చర్యలు తప్పవు

బూర్గుపల్లిలో శుక్రవారం జరిగిన సంఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని విచారణ అధికారిణి మెదక్ ఆర్డీఓ రమాదేవి పేర్కొన్నారు. స్పష్టమైన ఆదేశాలు వచ్చే వరకు చెరువులోకి దిగి ఎవరూ చేపలు పట్టవద్దని పేర్కొన్నారు.

భూమికి భూమి ఇవ్వాల్సిందే..



ఆందోళన చేస్తున్న రైతులు

గ్రామ సభను బహిష్కరించిన పిల్లుట్ల గ్రామస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): కొండపోచమ్మ కాలువ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు భూమికి భూమి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పిల్లుట్లలో శుక్రవారం కొండపోచమ్మ నుంచి సంగారెడ్డి వరకు నిర్మిస్తున్న కాళేశ్వరం కాలువ నిర్మాణానికి కావాల్సిన భూ సేకరణ కోసం గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, పలువురు అధికారులు పాల్గొన్నారు. గ్రామ పరిధిలో 84 ఎకరాల భూమి కాలువ నిర్మాణంలో పోతుందని వారికి ప్రభుత్వం సూచించిన విధంగా పరిహారం ఇస్తామని అధికారులు తెలిపారు. అందుకు రైతులు ఒప్పుకోలేదు. భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమి ఇస్తేనే ఒప్పుకుంటామని తేల్చిచెప్పారు. రైతుల ఆందోళనతో చేసేదేమీ లేక అధికారులు వెనుతిరిగి వెళ్లారు. అయితే గ్రామ సభలో నర్సాపూర్ మండలానికి చెందిన రైతులు ఆందోళన చేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. పరిణామాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు చెప్పారు.



మాట్లాడుతున్న ఆర్సీఓ సంపత్ కుమార్

సమ్మర్ క్యాంపు ప్రారంభం

మెదక్ కలెక్టరేట్: సమ్మర్ క్యాంపును ఇంటర్ విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్సీఓ సంపత్ కుమార్ పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థినులకు 'సమ్మర్ స్ప్రీ' పేరిట మెదక్‌లోని అజంపుర గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈనెల 29 వరకు కొనసాగనున్న కార్యక్రమాన్ని శుక్రవారం ఆర్సీఓ ప్రారంభించి మాట్లాడారు. 15 రోజుల్లో విద్యార్థినులకు కమ్యూనికేషన్, లైఫ్, పబ్లిక్ స్పీకింగ్, మీడియా స్కిల్స్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. ఇందుకోసం ఎంపిక చేసిన 11 కళాశాల విద్యార్థినులు హాజరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ హిమబిందు, శిక్షకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి

శివ్వంపేట/కొల్చారం(నర్సాపూర్): భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి అన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌ను శుక్రవారం శివ్వంపేట తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలించారు. మండలంలో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై తహసీల్దార్ శ్రీనివాస్‌చారిని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి బీఆర్‌ఎస్ నాయకులకు ఏటీఎంగా మారిందని మండిపడ్డారు. అసలైన రైతులకు అన్యాయం జరిగిందని వాపోయారు. భూములు కోల్పోయి ఇబ్బంది పడుతున్న రైతులను గుర్తించి న్యాయం చేస్తామన్నారు. శివ్వంపేట మండలంలోని కొంతన్‌పల్లి, నవాబుపేట, సికింద్లాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో భూ సమస్యలు తీవ్రంగా ఉన్న విషయం గుర్తించామన్నారు. త్వరలోనే రాష్ట్రస్థాయి బృందంతో పర్యటించి వాస్తవాలు వెలుగులోకి తెస్తామన్నారు. అవినీతికి పాల్పడిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, రాష్ట్ర నాయకుడు చింతల కరుణాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, నాయకులు నవీన్‌గుప్తా, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్, రమేష్‌గౌడ్, హన్మంత్‌రెడ్డి, కృష్ణాగౌడ్, అశోక్, శంకర్‌గౌడ్, తిరుపతినాయక్, గౌరిశంకర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొల్చారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. మాట్లాడి ధరణిలో పెండింగ్ దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు

కలెక్టర్ రాహుల్‌రాజ్




మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: 'మన ఊరు– మనబడి' ద్వారా ప్రారంభించబడి ఇంకా పూర్తికాని పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రమేశ్, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, మెప్మా పీడీ ఇందిర, ఇతర అధికారులు, మహిళా సమైక్య సభ్యులతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ, మౌలిక వసతులు కల్పనపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌కు ముందే పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన ప్రక్రియను ప్రారంభించాలన్నారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కమిటీల ద్వారా పాఠశాలల నిర్వహణ ప్రక్రియ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కమిటీల వద్ద రూ. 25 వేల వరకు ఎమర్జెన్సీ నిధులు ఉంటాయన్నారు. అనంతరం జిల్లాలోని ఎంపీడీఓలతో సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, గిరిజన సంక్షేమ పాఠశాలలకు గడువు తేదీలోగా మౌలిక వసతుల కల్పన పూర్తి చేయాలని సూచించారు. అలాగే పార్లమెంట్ ఎన్నికలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడుతున్న తరుణంలో నోడల్ అధికారులు తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ఎంపికపై లాటరీ పద్ధతి నిర్వహించారు. అంతకుముందు జర్నలిస్టుల సంఘం నాయకులు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మెదక్ పట్టణంలోని పటేల్‌కుంటలో గల మున్సిపల్ దుకాణాలకు రీ టెండర్ వేయాలని ప్రజా సంఘాల నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రజల మద్దతు ఎటువైపు?

పబ్లిక్ పల్స్.. జోరుగా కాల్స్

- తెలుసుకునే పనిలో రాజకీయ పార్టీలు
- ప్రజాభిప్రాయాలను ఐవీఆర్ ద్వారా సేకరణ
- ఆప్షన్లను ప్రెస్ చేయాలంటూ జోరుగా ఫోన్‌కాల్స్
- మెదక్ ఎంపీ అభ్యర్థులను ప్రకటించని కాంగ్రెస్, బీఆర్‌ఎస్
- బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు



సాక్షి, సిద్దిపేట: పార్లమెంట్ ఎన్నికల వేళ ప్రజల పల్స్ తెలుసుకునేందుకు వివిధ రాజకీయ పార్టీలు విశ్వ ప్రయత్నం చేస్తున్నాయి. వివిధ పద్ధతుల్లో ప్రయత్నాలు ప్రారంభించాయి. ఐవీఆర్ కాల్స్ ద్వారా ఓటర్ల మద్దతు తెలుసుకునే పనిలో పడ్డాయి. వారం రోజుల నుంచి వాయిస్ కాల్స్ వెల్లువెత్తున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో మెదక్, జహీరాబాద్ రెండు సెగ్మెంట్లలో ఇప్పటికే జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా సురేష్ షెట్కార్‌ను, బీజేపీ అభ్యర్థిగా ఎంపీ బీబీ పాటిల్, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గాలి అనిల్ కుమార్‌ను, మెదక్ బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావులను ప్రకటించారు. ఇంకా మెదక్ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించలేదు. అభ్యర్థిత్వాలను ఆశిస్తున్న ఆశావహుల్లో ఎవరికి ఓటర్ల మద్దతు ఉంటుందనే దాని పార్టీల వ్యూహకర్తలు వాయిస్ కాల్స్ ద్వారా సమాచారం సేకరిస్తున్నట్లు సమాచారం.

కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో?

మెదక్ పార్లమెంట్ పరిధిలోకి 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు చోట్ల బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే గెలుపొందారు. ఒక్క మెదక్ అసెంబ్లీ నుంచి మాత్రమే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ గెలుపొందారు. బీఆర్‌ఎస్‌కు ఎక్కువగా పట్టు ఉండటంతో అధికార కాంగ్రెస్ పార్టీ బలమైన నేతను బరిలో దించాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సతీమణి, సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, నీలం మధుముదిరాజ్‌లు టికెట్ ఆశిస్తున్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో బీఆర్‌ఎస్ పార్టీ ఇద్దరు కీలక నేతలు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావులు ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఎవరైతే బాగుంటుందని ఆలోచిస్తున్నట్లు సమాచారం. బీఆర్‌ఎస్ నుంచి అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డిని బరిలో దింపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ఎవరైతే బాగుంటుంది..

అధిక శాతం మంది ఓటర్లు ఫోన్ వినియోగిస్తున్నారు. ఓటర్లను కలిసి సర్వే నిర్వహించడంతో పాటు ఇలా ఐవీఆర్ కాల్స్ ద్వారా 5, 6, 7 ఆప్షన్లు ఇస్తున్నారు. మెదక్ పార్లమెంట్ సభ్యుడిగా ఎవరైతే బాగుంటుంది? ఎన్‌డీఏ, ఇండియా కూటమిలకు చెందిన ప్రధాని కావాలా అనే అంశంపై ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నారు. ప్రశ్నలకు సమాధానాలను ఆప్షన్ ఇచ్చి రాబడుతున్నారు. ఇలా ప్రజల నుంచి వచ్చిన సమాధానాలను క్రోడీకరించుకుని ప్రజాభిప్రాయం ఎవరికుందనే దానిపై ఓ అంచనాకు వచ్చేందుకు ప్రశ్నలు సంధిస్తున్నట్లు తెలుస్తోంది. మెదక్ ఎంపీ అభ్యర్థులను కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రకటించలేదు. ఇలా అభిప్రాయాల ద్వారా టికెట్లు సైతం ప్రకటించే అవకాశాలున్నాయి.

కాంగ్రెస్‌లో వీడని పీటముడి!

కొలిక్కిరాని మెదక్ లోక్‌సభ టికెట్ పంచాయితీ

- రేసులో మైనంపల్లి.. నీలంమధు
- తెరపైకి కొత్త పేరు..? కాంగ్రెస్‌లో చేరనున్న నరేంద్రనాథ్?
- తన పేరునూ పరిశీలించాలంటున్న నిర్మలాజగ్గారెడ్డి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : మెదక్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం ఎంపిక విషయంలో పీటముడి వీడటం లేదు. ప్రధానంగా ముగ్గురు నేతలు ఈ టికెట్‌ను ఆశిస్తున్నప్పటికీ.. కొత్త పేర్లు కూడా తెరపైకి వస్తుండటం ఆసక్తికరంగా మారింది. టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆశిస్తున్నారు. మల్కాజ్‌గిరి టికెట్‌పై కూడా ఆయన ఆశలు పెట్టుకున్నారు. అక్కడ ఇవ్వకుంటే మెదక్ టికెట్ అయినా ఖరారు చేయాలని ఆయన అధిష్టానాన్ని కోరినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే మెదక్ టికెట్ రేసులో పటాన్‌చెరుకు చెందిన నీలం మధు ముదిరాజ్ పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. ఆయన అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. పటాన్‌చెరు అసెంబ్లీ టికెట్ ఆయనకు ప్రకటించారు. ఆ తర్వాత ఆ టికెట్ కాటా శ్రీనివాస్‌గౌడ్‌కు దక్కింది. దీంతో పార్టీని వీడిన నీలం మధు బీఎస్పీ నుంచి పోటీ చేసి సుమారు 49 వేల ఓట్లు సాధించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి నీలం మధు కాంగ్రెస్‌లో చేరారు. బీసీ సామాజికవర్గం, ప్రధానంగా ముదిరాజ్ ఓట్లు నియోజకవర్గ పరిధిలో ఎక్కువగా ఉండటంతో నీలంకు టికెట్ ఇస్తే గెలుపు ఖాయమని కాంగ్రెస్ భావిస్తోంది. ఇటు సీఎం రేవంత్‌రెడ్డి ఆశీస్సులు కూడా నీలం మధుకు ఉన్నాయి. మరోవైపు తనకు ఇక్కడి టికెట్ కేటాయించాలని కోరుతూ సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు, జగ్గారెడ్డి సతీమణి నిర్మల ఇటీవల ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షిని కలవడం ఆసక్తికరంగా మారింది.

ఎవరైతే బాగుంటుంది?

మెదక్ ఎంపీ అభ్యర్థిగా ఎవరిని బరిలో నిలిపితే గెలుపు సాధ్యమవుతుందనే అంశంపై కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం ఆరా తీస్తోంది. ఇప్పటికే ఆ పార్టీ జిల్లా ముఖ్యనేతల అభిప్రాయాలను అధినాయకత్వం సేకరించింది. నియోజకవర్గం పరిధిలో ఉన్న పలువురు ముఖ్యనేతలకు ఈ విషయంలో ఫోన్లు చేసి అభిప్రాయాలను అడిగినట్లు కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.

తెరపైకి నరేంద్రనాథ్ పేరు..?

మెదక్ కాంగ్రెస్ అభ్యర్థిత్వం విషయంలో కొత్త పేరు తెరపైకి వస్తోంది. ఈ టికెట్‌ను ఆశిస్తున్న వారిలో సీహెచ్.నరేంద్రనాథ్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో ఉన్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జరుగుతోంది.

ఢిల్లీలో జగ్గారెడ్డి ప్రయత్నాలు

మెదక్ టికెట్ కోసం పలువురి పేర్లు పరిశీలన ఉన్న క్రమంలో సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఢిల్లీలో మకాం వేశారు. అధినాయకత్వాన్ని కలిసి టికెట్ ఇవ్వాలని కోరుతున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. తాను ఎంపీగా పోటీ చేయబోనని ఇప్పటికే ప్రకటించిన జగ్గారెడ్డి తన సతీమణి నిర్మలకు టికెట్ ఇప్పించుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు.



బీజేపీ అభ్యర్థిత్వం ఖరారు..

ఈ స్థానం నుంచి బీజేపీ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థిని ఆ పార్టీ ఇప్పటికే ప్రకటించింది. మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు టికెట్ ఇస్తున్నట్లు తేల్చేసింది. ఇక బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వం వంటేరు ప్రతాప్‌రెడ్డికి దాదాపు ఖాయమైందని గులాబీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇద్దరు ఓసీ సామాజిక వర్గాలకు చెందిన వారు బరిలోకి దిగుతున్న నేపథ్యంలో.. కాంగ్రెస్ పార్టీ బీసీ అభ్యర్థిని బరిలోకి దించితే ఎలా ఉంటుందనే అంశాన్ని పరిశీలిస్తోందని హస్తం పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



పాత మార్కెట్‌లో ఎండకు గొడుగులు ఏర్పాటు చేసుకున్న వీధి వ్యాపారులు

ముందు ముందు కష్టమే

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు ఠారెత్తిస్తున్నాయి.. రోజురోజుకూ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ప్రజలు బయటికి రావాలంటే బెంబేలెత్తుతున్నారు. మార్చిలోనే పరిస్థితి ఇలా ఉందంటే ఏప్రిల్‌, మే నెలలో ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటికి వెళ్లేవారు భానుడి ప్రతాపాన్ని తట్టుకునేందుకు గొడుగులు పట్టుకెళ్తున్నారు. అలాగే రోడ్లపై చల్లని పానీయాలు సేవిస్తున్నారు. ఇక ఇళ్లలోకి కూలర్లు తీసుకెళ్తున్నారు. రోడ్లపై నిత్య వ్యాపారులు పెద్ద పెద్ద గొడుగులు, గ్రీన్‌ మ్యాట్‌లు వేసుకొని కొనుగోళ్లు జరుపుతున్నారు. శుక్రవారం పలు ప్రాంతాల్లో సాక్షి కెమెరా క్లిక్‌ మనిపించిన కొన్ని చిత్రాలు...

– స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, సిద్దిపేట



గొడుగుతో వెళ్తున్న వృద్ధుడు



జ్యూస్‌ పాయింట్‌ వద్ద ప్రజలు





కూలర్లు కొనుగోలు చేసి తీసుకెళ్తూ..

క్లుప్తంగా

పీహెచ్‌సీ డాక్టర్‌ సస్పెన్షన్‌

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం దౌల్తాబాద్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌ శంకర్‌ను సస్పెండ్‌ చేస్తూ జిల్లా కలెక్టర్‌ క్రాంతి ఉత్తర్వులను విడుదల చేశారు. సక్రమంగా విధులు నిర్వహించడం లేదని స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డాక్టర్‌ను సస్పెండ్‌ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను శంకర్‌ కు అధికారులు అందించారు.

ఆర్టీసీలో అప్రెంటీస్‌ మేళా

సంగారెడ్డి టౌన్‌: మెదక్‌ రీజియన్‌ పరిధిలోని ఆర్టీసీలో నాన్‌ ఇంజనీరింగ్‌ గ్రాడ్యుయేట్‌ అప్రెంటీస్‌ కోసం శిక్షణ ఇస్తున్నామని రీజినల్‌ మేనేజర్‌ ప్రభులత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్‌ అప్రెంటీస్‌ ట్రైనింగ్‌ స్కీమ్‌ వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకొని ఈ నెల 20వ తేదీన సంగారెడ్డి లోని రీజినల్‌ మేనేజర్‌ ఆఫీస్‌ త్రినేత్ర కాంప్లెక్స్‌లో హాజరు కావాలన్నారు. పూర్తి ఒరిజినల్‌ సర్టిఫికెట్లు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్న రసీదును తీసుకొని రావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99592 26266 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

జిమ్నాస్టిక్స్‌ పోటీలకు..

బుదేరా గురుకుల విద్యార్థి ఎంపిక



శిల్పారాణిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌, తదితరులు

మునిపల్లి(అందోల్‌): మునిపల్లి మండలంలోని బుదేర చౌరస్తాలో గల సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని ఎం.శిల్పారాణి ఆల్‌ ఇండియా ఇంటర్‌ యూనివర్సిటీ ఆర్టిస్టిక్‌ జిమ్నాస్టిక్స్‌ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్‌ ఆరిఫా తెహసీన్‌ తెలిపారు. కళాశాలలో డిగ్రీ ఫైనల్‌ ఇయర్‌ చదువుతున్న శిల్పారాణి పంజాబ్‌ రాష్ట్రంలోని అమృతసర్‌లో ఈ నెల 19 నుంచి 21 తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్‌ ఆరిఫా, వైస్‌ ప్రిన్సిపాల్‌ శైలజ, ఫిజికల్‌ డైరెక్టర్‌ రమాదేవి అభినందించారు.

కీర్తి పురస్కారం



సుధాకర్‌

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): సిద్దిపేటకు చెందిన ప్రముఖ కథా రచయిత చొప్పదండి సుధాకర్‌కి పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ 2022 సంవత్సరానికి గాను కీర్తి పురస్కారం ప్రకటించిందని ప్రముఖ కవి రాజమౌళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చొప్పదండి సుధాకర్‌ వృత్తిపరంగా ఉపాధ్యాయుడు. ప్రవృతి రీత్యా సాహిత్యంపై ఎనలేని ప్రేమను పెంచుకొని నాలుగు దశాబ్దాలుగా సాహిత సృజన చేస్తున్నారన్నారు. కథ, కవిత, నవల, విమర్శనా రంగాల్లో విశేషమైన సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. సుధాకర్‌కి కీర్తి పురస్కారం రావడంపై మిత్రులు, సాహితీవేత్తలు, సహోపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

షటిల్‌ బ్యాడ్మింటన్‌లో సత్తా



బహుమతి అందజేస్తున్న లక్ష్మీకాంతరావు

నారాయణఖేడ్‌: అంతర్‌ జిల్లా షటిల్‌ బ్యాడ్మింటన్‌ టోర్నీలో ఖేడ్‌ విద్యార్థులు సత్తాచాటారు. కామారెడ్డి జిల్లా పిట్లంలో నిర్వహించిన డబుల్స్‌ ఓపెన్‌ షటిల్‌ టోర్నీలో గంభీర్‌, సోనులు నిజామాబాద్‌తో పాటు హైదరాబాద్‌ అకాడమీ వారితో తలపడి ద్వితీయ బహుమతిని సొంతం చేసుకున్నారు. వీరికి జుక్కల్‌ ఎమ్మెల్యే లక్ష్మీమకాంతరావు రూ.5,555 నగదు బహుమతిని అందించారని ఖేడ్‌ కోచింగ్‌ సెంటర్‌ నిర్వాహకులు అబ్దుల్‌ సాజీద్‌ తెలిపారు. చిన్నారులను షటిల్‌ అసోసియేషన్‌ బాధ్యులు రవికుమార్‌, మారుతీ, భూమయ్య, దేవిసింగ్‌, ప్రవీణ్‌, రవిగౌడ్లు అభినందించారు.

పదింతల కసరత్తు..

- శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకు
- పదవ తరగతి పరీక్షలకు ప్రత్యేక తరగతులు
- 18వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం
- జిల్లాలో 448 పాఠశాలలు, 13,987 మంది విద్యార్థులు



దుబ్బాక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ప్రత్యేక తరగతులు

దుబ్బాక: పదవ తరగతిలో ఉత్తమ పాయింట్లను సాధించడానికి విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఉపాధ్యాయులు సైతం ఈ సంవత్సరం ఎక్కువ మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించి, 100 శాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రణాళికలు రూపొందించి అమలు పరుస్తున్నారు. ఈనెల 18వ తేదీ నుంచి ఏప్రిల్‌ 2 వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 80 పరీక్షలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 448 పాఠశాలలు ఉండగా 13,987 మంది విద్యార్థులు పది పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. వీరిలో 7036 మంది బాలురు, 6951 మంది బాలికలు ఉన్నారు. దుబ్బాక మండలంలో దుబ్బాకతోపాటు, రాజక్కపేట, లచ్చపేట, ధర్మాజీపేట, చీకోడ్‌ మొత్తం 14 జిల్లా పరిషత్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, లచ్చపేట మోడల్‌ స్కూల్‌, కస్తూర్బా, మైనార్టీ రెసిడెన్షియల్‌, ఎస్సీ రెసిడెన్షియల్‌ పాఠశాలలో ఇంగ్లిష్‌, తెలుగు మీడియంలో 705 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులందరూ 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థుల పై ప్రత్యేకంగా దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు రాబట్టేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

10 జీపీఏ లక్ష్యం



ఈ నెలలో జరిగే పదవ తరగతి పబ్లిక్‌ పరీక్షల్లో 10 జీపీఏ లక్ష్యంగా ప్రణాళిక రూపొందించుకున్నాను. పాఠశాలలో స్టడీ అవర్స్‌ సమయంలో నాకు వచ్చే సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు. వారి ప్రణాళిక ప్రకారం చదువుతున్నాం. మంచి ఫలితాలు సాధిస్తాం.

ప్రపూర్ణ, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, దుబ్బాక

ఎంతో ఉపయోగం



పదవ తరగతిలో 10 జీపీఏ సాధించేందుకు పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు ఎంతగానో దోహదపడుతున్నాయి. మాకు వచ్చే సందేహాలను ఉపాధ్యాయులు వెంటనే నివృత్తి చేస్తున్నారు. సబ్జెక్టుల వారీగా ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలే ధ్యేయంగా కృషి చేస్తున్నారు.

స్నేహిత, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, దుబ్బాక

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం..



మండలంలో 14ప్రభుత్వ పాఠశాలలో మొత్తం 705 మంది విద్యార్థులు 10 వ తరగతి చదువుతున్నారు. విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రతీ పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. అందరి సహకారంతో విద్యార్థులు వంద శాతం పాసయ్యేలా కృషి చేస్తాం.

– జోగు ప్రభుదాస్‌, మండల విద్యాధికారి, దుబ్బాక

ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి

డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ కాశీనాథ్‌



శిశువును పరిశీలిస్తున్న డాక్టర్‌ విజయరాణి

సిద్దిపేటకమాన్‌: గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ కాశీనాథ్‌ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. మార్చి మాసాన్ని పుట్టుకతో వచ్చే రుగ్మతల గుర్తింపు, అవగాహన మాసంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి గర్భిణులకు, బాలింతలకు పుట్టుకతో వచ్చే రుగ్మతలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. శిశువుల్లో మెదడు, నరాలు, కంటి, చెవి, ముఖం ప్రేగులు, కిడ్నీలు, కండరాలు, ఎముకలకు సంబంధించిన రుగ్మతలను గుర్తించి చికిత్స అందిస్తున్నామన్నారు. గర్భిణులు ఫోలిక్‌ యాసిడ్‌ మాత్రలు తీసుకోవడంతోపాటు మంచి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. జిల్లా ఇమ్యూనైజేషన్‌ అధికారి డాక్టర్‌ విజయరాణి సింగన్నగూడెం పీహెచ్‌సీ పరిధిలో బాలింతలను, శిశువులను పరిశీలించినట్లు తెలిపారు.

అటవీ కళాశాలలో ఆటల పోటీలు



క్రీడా జట్టుతో ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్‌ చాన్స్‌లర్‌ డాక్టర్‌ నీరజ, అధ్యాపక బృందం

- ప్రారంభించిన వైస్‌ చాన్స్‌లర్‌ నీరజ
- మూడు రోజులపాటు నిర్వహణ

ములుగు(గజ్వేల్‌): క్రీడా సంగ్రామానికి సిద్దిపేట జిల్లా ములుగు అటవీ కళాశాల పరిశోధన కేంద్రం వేదికైంది. శ్రీ కొండా లక్ష్మణ్‌ బాపూజీ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పోస్ట్‌ గ్రాడ్యుయేట్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ హార్టికల్చరల్‌ సైన్సెస్‌, అటవీ కళాశాల పరిశోధన కేంద్రం కలిసి నిర్వహిస్తున్న 3వ అంతర కళాశాల క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య పోటీలను శుక్రవారం ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్‌ చాన్స్‌లర్‌ డాక్టర్‌ బి.నీరజ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 15వ తేదీ నుంచి 17 వరకు మూడు రోజులపాటు జరిగే ఈ క్రీడా పోటీల్లో ములుగు ఉద్యాన, అటవీ కళాశాల విద్యార్థులతోపాటు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌, వనపర్తి జిల్లాలోని మాల్యాల ఉద్యాన కళాశాల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. శారీరక దారుఢ్యానికి పోటీలు దోహదపడుతాయని అన్నారు. విశ్వవిద్యాలయంలో క్రీడలకు సైతం సమాన ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మొదటి రోజు క్రికెట్‌, వాలీబాల్‌, చెస్‌, క్యారమ్‌, టేబుల్‌ టెన్నిస్‌ పోటీల్లో ఆయా జట్లు తలబడ్డాయి. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు భగవాన్‌, రాజశేఖర్‌, విజయ, వెంకటేశ్వర్లు, ప్రశాంత్‌, చీనా, సైదయ్య ఆయా కళాశాలల ప్రొఫెసర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లోన్‌ యాప్‌ పేరుతో మోసాలు

రూ.1,54,854 పోగొట్టుకున్న బాధితులు



సిద్దిపేటకమాన్‌: పోలీసు అధికారులు అవగాహన కల్పిస్తున్నా ప్రజలు అత్యాశ, సులభంగా డబ్బులు వస్తాయని ఆశపడి గుర్తు తెలియని వ్యక్తులకు ఆన్‌లైన్‌లో డబ్బులు పంపి మోసపోతున్నారు. ఆన్‌లైన్‌ యాప్‌లో తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని, లోన్‌ మంజూరైందంటూ ప్రాసెసింగ్‌ చార్జీల పేరిట పలువురు బాధితులు గుర్తు తెలియని వ్యక్తులకు రూ.1,54,854 పంపించి మోసపోయారు. కమిషనరేట్‌ పరిధిలో చోటు చేసుకున్న పలు సైబర్‌ మోసాల వివరాలను సీపీ వెల్లడించారు. హుస్నాబాద్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలోని ఓ వ్యక్తి ఇన్‌స్టాగామ్‌ రీల్స్‌లో రౌలేట్‌ గేమ్‌ యాప్‌ గురించి తెలుసుకొని అందులో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మి ఆన్‌లైన్‌లో రూ.50 వేలు పంపించాడు. తర్వాత లింకును ఓపెన్‌ చేయగా బ్లాక్‌ చేసి ఉండటంతో మోసపోయాయని గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్‌ నెంబర్‌ 1930కు ఫిర్యాదు చేశాడు. హుస్నాబాద్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలో మరో వ్యక్తి గుర్తు తెలియని వ్యక్తికి ఆన్‌లైన్‌లో రూ.48,954 పంపించి మోసపోయాడు. జగదేవ్‌పూర్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలోని ఓ వ్యక్తికి బజాజ్‌ లోన్‌ యాప్‌ నుంచి మాట్లాడుతున్నామని గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌ చేశాడు. మీకు లోన్‌ మంజూరైందని, లోన్‌ డబ్బులు ఖాతాలో జమ కావాలంటే ప్రాసెసింగ్‌ చార్జీలు చెల్లించాలని చెప్పగా ఆ మాటలు నమ్మి ఆన్‌లైన్‌లో రూ.55,900 పంపించాడు. తర్వాత లోన్‌ యాప్‌ ఓపెన్‌ చేయగా బ్లాక్‌ చేసి ఉండడంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్‌ నెంబర్‌ 1930కు ఫిర్యాదు చేశాడు.

కుటుంబ కలహాలతో..

సఫాయి కార్మికుడు ఆత్మహత్య



దుర్గయ్య (ఫైల్‌)

పాపన్నపేట(మెదక్‌): సఫాయి కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని మల్లంపేటలో చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్సై నరేశ్‌ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పర్వన్నోల్ల దుర్గయ్య (30), లక్ష్మీ భార్యాభర్తలు. బతుకు దెరువు కోసం దుర్గయ్య గ్రామంలో సఫాయి కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. బతుకు దెరువు కోసం హైదరాబాద్‌ వెళ్దామని శుక్రవారం భార్యతో గొడవ పడ్డాడు. అనంతరం బయటకు వెళ్లిన దుర్గయ్య క్రిమి సంహారక మందు తాగి ఇంటికొచ్చాడు. వాసన గమనించిన కుటుంబీకులు వెంటనే అతడిని 108 వాహనంలో మెదక్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చేర్యాల(సిద్దిపేట): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన శుక్రవారం చేర్యాల పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ దామోదర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రానికి చెందిన మంద విజేందర్‌ రెడ్డి తన భార్యవిజయతో కలిసి వ్యవసాయ పనుల నిమిత్తం బైరాన్‌పల్లి గ్రామానికి ఈనెల 8న ఇంటికి తాళం వేసి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళం పగులగొట్టి రూ.6,500 నగదు, 25 తులాల వెండిని దొంగిలించారు. ఇంటి చుట్టుపక్కల వారి ద్వారా సమాచారం అందుకున్న భార్యాభర్తలు వచ్చి చూసేసరికి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

చేర్యాల(సిద్దిపేట): అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసిన ఘటన చేర్యాల పోలీస్‌ స్టేషన్‌లో శుక్రవారం చేసుకుంది. ఎస్‌ఐ దామోదర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారంతో తాడూరు శివారులో ఒక ట్రాక్టర్‌, పట్టణ శివారులో మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని ఇసుకను సీజ్‌ చేశామన్నారు. ఇసుక, పీడీఎస్‌, రవాణా చేసిన, పేకాట, జూదం, గంజాయి విక్రయించిన, చట్టవ్యతిరేక కార్యక్రమాలక పాల్పడిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రకృతివనంలో గంజాయి విక్రయం

ఇద్దరు నిందితుల అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

వర్గల్‌(గజ్వేల్‌): పల్లె ప్రకృతివనంలో గంజాయి విక్రయానికి పాల్పడుతున్న ఇద్దరిని వర్గల్‌ మండలం గౌరారం పోలీసులు అరెస్ట్‌ చేసి కోర్టులో రిమాండ్‌ చేశారు. ఈ కేసుకు సంబంధించి వివరాలను గౌరారం పోలీస్‌స్టేషన్‌లో గజ్వేల్‌ రూరల్‌ సీఐ మహేందర్‌రెడ్డి వెల్లడించారు. వర్గల్‌కు చెందిన దిండి శివానంద్‌ (20), చెన్నకిష్టి సాయికిరణ్‌ (20) కొంతకాలం నుంచి హైదరాబాద్‌కు చెందిన నీతూ భాయ్‌ వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నారు. అందులో కొంత వారు తాగుతూ, మిగితా గంజాయిని చుట్టుపక్కల గ్రామాల యువకులకు, కూలీ పనులు చేసుకునే వారికి విక్రయిస్తున్నారు. పది రోజుల కిందట ఇదే విధంగా గంజాయి కొనుగోలు చేశారు. గురువారం నగరం తండా సమీప అవుసులోనిపల్లి పల్లె ప్రకృతివనంలో వీరు గంజాయిని విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు దాడి చేసి వారి నుంచి 130 గ్రాముల గంజాయి ప్యాకెట్‌ను, బైక్‌ను, రెండు మొబైల్‌ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో గౌరారం ఎస్సై శివకుమార్‌, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో పురుగు మందు తాగి

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గజ్వేల్‌రూరల్‌: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గజ్వేల్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని పిడిచెడ్‌ గ్రామానికి చెందిన వేములవాడ రామచారి కార్పెంటర్‌గా పని చేస్తుండేవాడు. ఇతడి మొదటి భార్య వెంకటలక్ష్మీ కొన్నేళ్ల కిందట మృతి చెందగా, రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు కూతురు, కుమారుడు ఉండగా.. కూతురి వివాహం జరిపించాడు. రెండో భార్యకు 9 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. కార్పెంటర్‌ వృత్తి సరిగ్గా నడవక ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ వస్తున్నాడు. ఈ నెల 12న మొదటి భార్య సమాధి వద్దకు వెళ్లి సమస్యలను చెప్పుకొని కుమిలిపోయాడు. అనంతరం వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పాడు. వెంటనే అప్రమత్తమైన కుటుంబీకులు రామచారిని చికిత్స నిమిత్తం గజ్వేల్‌ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మూడ్రోజులుగా చికిత్స పొందూ మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్‌ సీఐ సైదా తెలిపారు.

రహస్యంగా మున్సిపల్‌ బడ్జెట్‌ సమావేశం

- మీడియాకు అనుమతించని అధికారులు
- శానిటేషన్‌ వ్యవస్థపై సభ్యులు మండిపాటు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌

సంగారెడ్డి: సంగారెడ్డి మున్సిపల్‌ బడ్జెట్‌ సమావేశం శుక్రవారం రహస్యంగా కొనసాగింది. ప్రతీ మీటింగ్‌ కు మీడియాను అనుమతించే అధికారులు ఈ బడ్జెట్‌ సమావేశానికి దూరం పెట్టారు. బడ్జెట్‌ సమావేశానికి అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిల్‌ సభ్యులు పలు సమస్యలపై అధికారులను నిలదీసినట్లు తెలిసింది. కౌన్సిల్‌ హాల్‌లో సీఎం రేవంత్‌ రెడ్డి చిత్రపటాన్ని పెట్టాలని 23వ వార్డు కౌన్సిలర్‌ కూన వనిత అదనపు కలెక్టర్‌ను కోరారు. అలాగే, ఇటీవల సాక్షిలో వచ్చిన కథనానికి స్పందించిన సభ్యులు సంగారెడ్డి పట్టణంలో శానిటేషన్‌ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని వనిత మండిపడ్డారు. వెంటనే ఫాగింగ్‌ యంత్రాలను కొనుగోలు చేసి పట్టణంలో శానిటేషన్‌ వ్యవస్థ మెరుగుపర్చాలని కోరారు. మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్‌ ప్రసాద్‌ చౌహన్‌, మున్సిపల్‌ డీఈ ఇంతియాజ్‌ హమ్మద్‌, ఆర్‌వో విజయలక్ష్మి, అధికారులు సూర్యప్రకాశ్‌, చంద్రశేఖర్‌, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్‌ కలకలం

అనుమానంతో ఓ మహిళను చితకబాదిన స్థానికులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో పిల్లల కిడ్నాప్‌ కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. మిరుదొడ్డిలో శుక్రవారం సుమారు 42 ఏళ్ల వయసు కలిగిన ఓ మహిళ అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని స్థానికులు గమనించారు. రెండో వార్డులో ఓ పిల్లాడిని పలకరిస్తూ చేయి పట్టుకుండటాన్ని గుర్తించి ఆమెను నిలదీశారు. ఆమె పొంతన లేని సమాధానం ఇస్తుండటంతో స్థానికులు ఆగ్రహంతో చితకబాదారు. విషయం తెలుసుకున్న మిరుదొడ్డి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మహిళను అదుపులోకి తీసుకున్నారు. బైక్‌పై మహిళను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. ఆమె మండల పరిధిలోని కాసులాబాద్‌ బుడగజంగం కులానికి చెందిన బాలసంత యాదమ్మగా తేలింది. యాదమ్మకు భర్త ముత్తయ్యతో శుక్రవారం తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది. ఈ కోపంతో ఆమె తల్లిగారిల్లయిన తొగుట మండలం గుడికందులకు మిరుదొడ్డి మీదుగా కాలినడకన బయలు దేరింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న యాదమ్మ ఓ పిల్లాడితో మాట్లాడుతుండగా సమస్య వచ్చిందని పోలీసులు తెలిపారు.

వాటర్‌ ట్యాంకర్‌ను ఢీకొట్టిన బస్సు

ఐదుగురికి గాయాలు



ముందు భాగం దెబ్బతిన్న బస్సు

దుబ్బాకటౌన్‌: ఆగి ఉన్న వాటర్‌ ట్యాంకర్‌ను బస్సు ఢీకొట్టడంతో ఐదుగురిని గాయాలు అయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. దుబ్బాక డిపోకు చెందిన ప్రైవేట్‌ బస్‌ సిద్దిపేట నుంచి సికింద్రాబాద్‌కు 38 మంది ప్రయాణికులతో వెళ్తుంది. మేడ్చల్‌-రంగారెడ్డి జిల్లా తుర్కపల్లి శివారులోకి వెళ్లగానే అదుపుతప్పి రోడ్డు పక్కనే ఆగి ఉన్న హెచ్‌ఎండీఏ వాటర్‌ ట్యాంకర్‌ను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్‌ ముందు భాగం డ్రైవర్‌ క్యాబిన్‌ నుజ్జునుజ్జయింది. డ్రైవర్‌ బాలకిషన్‌, కండక్టర్‌ నర్సింలుతో పాటు మరో ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. గాయపడ్డ వారిని వెంటనే 108 లో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. బస్‌లో దుబ్బాక ప్రాంతానికి చెందిన ప్రయాణికులు ఎవరూ లేరని తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.